క్లుప్తంగా

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

అట్లూరు : భూ సమస్యల పరిష్కారానికే గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు సుబ్బలక్షుమ్మ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని వేములూరు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా భూ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన రైతులు అర్జీలు స్వీకరించారు. డిప్యూటీ తహసీల్దారు శిరీష, ఆర్ఐ రమణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కాశినాయన : భూ సమస్యలను రెవెన్యూ సదస్సుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని తహసీల్దారు వెంకటసుబ్బయ్య సూచించారు. సోమవారం మండలంలోని ఉప్పలూరు గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం 87 అర్జీలు వచ్చాయన్నారు. వీటిని పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు రవిశంకర్, ఆర్ఐ అమర్‌నాథ్‌రెడ్డి, స్థానిక వీఆర్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పండ్లు పంపిణీ



పిల్లలకు స్వీట్లు, పండ్లు అందజేస్తున్న ఇర్ఫాన్‌బాషా

ప్రొద్దుటూరు క్రైం : కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకురాలు సోనియాగాంధీ జన్మదిన వేడుకలను సోమవారం వికాస్ విహార్ మానసిక దివ్యాంగుల శిక్షణా కేంద్రంలో పిల్లల మధ్య ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇర్ఫాన్‌బాషా కేక్ కట్ చేసి పిల్లలకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శిక్షణా కేంద్ర నిర్వాహకులు, ఉపాధ్యాయులతోపాటు కాంగ్రెస్ నాయకులు గోసంగి వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్యపరీక్షలు



గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

బి.కోడూరు : బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం వైద్యాధికారులు డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు, డాక్టర్ ఉదయ్‌కిరణ్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కింద గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బద్వేలు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మల్లేష్ మాట్లాడుతూ గర్భిణులు క్రమం తప్పకుండా టీకాలు వేయించుకుని ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ఇచ్చే ఐరన్ మాత్రలు తినాలని, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించి ఎన్‌సీడీ సర్వే గురించి ఆరా తీశారు. క్యాన్సర్ పరీక్షలు, బీపీ, షుగర్, ఓరల్ క్యాన్సర్ లక్షణాలు గుర్తించి ఆన్‌లైన్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దావీదు, సీహెచ్‌ఓ నాగమణి, పీహెచ్‌ఎన్ పుష్పాంజలి, ఆప్తాల్మిక్ ఆఫీసర్ హుస్సేనయ్య, హెల్త్ సూపర్‌వైజర్లు జాన్‌విలియం, విజయలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ జయంతి, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


సమస్యల పరిష్కారంపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుట్టా

ఖాజీపేట : రెవెన్యూ సదస్సులో వచ్చే ప్రతి సమస్యను నెల రోజుల్లో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ అధికారులకు సూచించారు. సోమవారం త్రిపురవరం గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా 28 మంది తమ సమస్యలపై అధికారులకు అర్జీలు అందించారు. ఎమ్మెల్యే పుట్టా సుదాకర్ యాదవ్ మాట్లాడుతూ సదస్సుల్లో వచ్చే ప్రతి అర్జీని ఆన్‌లైన్ చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సుస్మిత, తహసీల్దార్ మహబూబ్‌బాషా, టీడీపీ మండల అధ్యక్షుడు లక్ష్మిరెడ్డి, మాజీ ఉపమండలాధ్యక్షుడు చంద్రఓబుల్‌రెడ్డి, హరినాథరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ వాలీబాల్ జట్టుకు ఎంపిక



ఎంపికైన విద్యార్థినులతో కళాశాల ప్రతినిధులు

ప్రొద్దుటూరు కల్చరల్ : మండల పరిధిలోని గౌతమి మహిళా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులు సుస్మిత, సుకన్య సౌత్‌జోన్ జేఎన్‌టీయూఏ జట్టుకు ఎంపికయ్యారు. కావలిలో ఆర్ఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇటీవల జరిగిన జేఎన్‌టీయూఏ అంతర్ కళాశాలల వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనపరచి వీరు సౌత్‌జోన్ జట్టుకు ఎంపికయ్యారు. వీరిని ప్రిన్సిపాల్ రామసుబ్బమ్మ, కరస్పాండెంట్ బాబమ్మ, డైరెక్టర్‌లు నాగూర్, రవీంద్రారెడ్డి, కో డైరెక్టర్ శైలూష, పీడీ ఓబయ్య సోమవారం అభినందించారు.

అభివృద్ధి పనులు రద్దు



గోకుల్‌నగర్ -2లో ప్రారంభించిన డ్రైనేజీ కాలువ నిర్మాణ పనులు



గోకుల్ నగర్-1లో పనుల కోసం నిల్వ చేసిన గ్రావెల్

- డ్రైనేజీ కాలువల ఆధునీకరణ, పైపులైన్ నిర్మాణం నిలిపివేత
- నిర్ణయం తీసుకున్న కూటమి ప్రభుత్వం
- వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.282 కోట్లు మంజూరు
- పనులకు శంకుస్థాపన చేసిన అప్పటి సీఎం జగన్

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలో చేపట్టనున్న డ్రైనేజీ కాలువల ఆధునీకరణతోపాటు తాగునీటి పైపులైన్ నిర్మాణ పనులు రద్దయ్యాయి. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం పనులకు రూ.282 కోట్లు మంజూరు చేయగా.. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ పనులను రద్దు చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి. ప్రొద్దుటూరు నియోజకవర్గానికి సంబంధించి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ప్రతిపాదన మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు అభివృద్ధి పనులను మంజూరు చేశారు. ఒకే మారు రూ.515 కోట్ల నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ప్రొద్దుటూరు నియోజకవర్గ చరిత్రలో ఇది ఒక మైలురాయిగా నిలిచిపోయింది. కరోనా పరిస్థితుల అనంతరం 2021 డిసెంబర్ 23న ఈ పనులకు స్వయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి శిలాఫలకం వేశారు. కూరగాయల మార్కెట్ నిర్మాణానికి రూ.53 కోట్లు, పెన్నా నదిపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.50 కోట్లు, ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణానికి రూ.4.5 కోట్లు, ఎస్‌సీఎస్‌ఆర్ ప్రభుత్వ కళాశాల నిర్మాణానికి రూ.24 కోట్లు, జిల్లా ఆస్పత్రి అభివృద్ధికి రూ.20 కోట్లు, వైఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాల తరగతి గదుల నిర్మాణానికి రూ.65 కోట్ల నిధులు మంజూరు చేయించడంతోపాటు ప్రొద్దుటూరు పట్టణ ప్రజలను పీడిస్తున్న డ్రైనేజీ కాలువల ఆధునీకరణ, తాగునీటి పైపులైన్ నిర్మాణానికి రూ.282 కోట్లు నిధులు మంజూరు చేశారు. పూర్వం నుంచి పట్టణంలో ఉన్న ఐదు మురుగు నీటి కాలువల పరిస్థితి అధ్వానంగా ఉంది. వీటిని ఆధునీకరించడంతోపాటు కొత్తపల్లె బైపాస్ రోడ్డు సమీపంలో సేవరేజ్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. ఈ పనులు పూర్తయితే పట్టణాన్ని దోమల బెడద నుంచి నివారించవచ్చని రాచమల్లు శివప్రసాదరెడ్డి అంచనా వేశారు. అలాగే 50 ఏళ్ల క్రితం పట్టణంలోని ప్రధాన తాగునీటి పైపులైన్ నిర్మించారు. దీని స్థానంలో కొత్త పైపులైన్ నిర్మించడంతోపాటు ఓవర్ హెడ్ ట్యాంకులను నిర్మించేందుకు నిధులు మంజూరు చేయించారు. రెండు పనులకు సంబంధించి టెండర్లు పూర్తయ్యాయి. రెండు కాంట్రాక్టు పనులు ఒకే కాంట్రాక్టు కంపెనీ దక్కించుకోవడం జరిగింది. గత ఏడాది పనులు ప్రారంభమయ్యాయి. ప్రొద్దుటూరు మున్సిపాలిటీ కార్యాలయం నుంచి చీఫ్ ఇంజినీరింగ్ కార్యాలయం వరకు పలు మార్లు ఫైళ్లు తిరిగిన తర్వాత పనులను ప్రారంభించారు. మొదటగా కొర్రపాడు రోడ్డులోని గోకుల్ నగర్‌లో ఇప్పటి వరకు డ్రైనేజీ కాలువల నిర్మాణం లేదు. దీంతో అక్కడి నుంచే పనులు ప్రారంభించారు. పనుల నిర్వహణలో జాప్యం కావడం, ఎన్నికలు రావడంతో పనులు ఆగిపోయాయి. ఎన్నికల అనంతరం ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ పనులను రద్దు చేశారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకే..



ప్రభుత్వ ఆదేశాల మేరకు డ్రైనేజీ కాలువల ఆధునీకరణ, పైపులైన్ నిర్మాణ పనులు రద్దయ్యాయి. గడిచిన ఎన్నికల నాటికి 25 శాతం పూర్తయిన పనులను మాత్రమే కొనసాగిస్తున్నారు. డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులు ఒక్క శాతం మాత్రమే పూర్తయ్యాయి. పట్టణ అవసరాల దృష్ట్యా ఈ పనులను తిరిగి చేపట్టేందుకు ప్రతిపాదనలను తయారు చేసి పంపుతున్నాం. మళ్లీ పనులు మంజూరయ్యే అవకాశం ఉంది.

– ఎ.మల్లికార్జున, మున్సిపల్ కమిషనర్, ప్రొద్దుటూరు

మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి



మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న కార్మికులు

బద్వేలు అర్బన్ : మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం ఇవ్వడంతో పాటు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు మల్లికార్జున, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి నాగేష్ కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా సమయంలో దినసరి వేతనం కింద పారిశుద్ధ్య పనులకు తీసుకున్న కార్మికులను ఆప్కాస్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. అలాగే పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.31 వేలు అందజేయాలని కోరారు. ప్రభుత్వం స్పందించి మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కోశాధికారి నర్సయ్య నాయకులు వెంకటరెడ్డి, దేవా, నరసింహులు, శ్రీనివాసరాజు, వెంకటేష్, ప్రసాద్, బాబీ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగు పరచాలి



పారిశుద్ధ్య సిబ్బందికి సూచనలు చేస్తున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం మెరుగు పరచాలని మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బందికి మున్సిపల్ కమిషనర్ ఎ.మల్లికార్జున సూచించారు. సోమవారం స్థానిక టీబీ రోడ్డులోని ఒకటో డివిజన్ పారిశుద్ధ్య కార్మికుల మస్టర్ పాయింట్, నాలుగో డివిజన్‌లోని మలేరియా మస్టర్ పాయింట్‌ను కమిషనర్ సందర్శించి కార్మికులకు సూచనలు చేశారు. టీబీ రోడ్డులోని అన్న క్యాంటీన్‌ను పరిశీలించి, శుభ్రంగా ఉంచాలని సిబ్బందికి తెలిపారు. సుబ్బిరెడ్డి కొట్టాలులో కాలువలోని నీరు రోడ్డుపైకి వస్తోందని స్థానికులు కమిషనర్‌కు చెప్పారు. ఆయన పరిశీలించి ఈ సమస్యను పరిష్కరించాలని శానిటేషన్, ఇంజినీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఎస్.నూర్‌బాషా, వి.సుబ్బరాయుడు, ఏఈ కె.సురేంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

బైపాస్ రోడ్డులో వ్యర్థాలు వేస్తే చర్యలు



పట్టణ ప్రణాళిక సిబ్బందికి సూచనలిస్తున్న మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి

బద్వేలు అర్బన్ : స్థానిక పోరుమామిళ్ల బైపాస్ రోడ్డులో భవన నిర్మాణాల, కూల్చివేత వ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి హెచ్చరించారు. సోమవారం బైపాస్‌రోడ్డులో పర్యటించిన ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఇకపై ఎవరైనా బైపాస్‌రోడ్డులో వ్యర్థాలు వేస్తే ఒక వాహనానికి రూ.2 వేలు చొప్పున జరిమానా విధిస్తామని తెలిపారు. మున్సిపాలిటీలోని 23 మంది ప్లానింగ్ సెక్రటరీలతో నిఘా ఉంచుతామన్నారు. అలాగే పట్టణంలో భవన నిర్మాణాల, కూల్చివేతల వ్యర్థాలను సీమాంక్ ఆసుపత్రి పక్కన నీటికుంటలో మాత్రమే వేయాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి ఎక్కడైనా వ్యర్థాలు వదులుతున్న వారిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టిస్తే వారికి పురపాలక సంఘం తరపున వెయ్యి రూపాయల నగదును పారితోషికంగా ఇస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో పట్టణ ప్రణాళిక సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీపేటలో 10 బృందాలతో పింఛన్ల తనిఖీ



లక్ష్మీపేటలో పింఛన్ల తనిఖీని పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్

చాపాడు : మండల పరిధిలోని లక్ష్మీపేట గ్రామ పంచాయతీలో సోమవారం 10 ప్రత్యేక బృందాలు పింఛన్ల తనిఖీ నిర్వహించాయి. పంచాయతీ పరిధిలోని లక్ష్మీపేట, కేతవరం, వీరభద్రాపురం గ్రామాలలో వృద్ధాప్య, వితంతు, వికలాంగ, ఒంటరి మహిళలతో పాటు ఇంకా పలు రకాలైన సామాజిక పింఛన్లలో అనర్హులను గుర్తించేందుకు మండల స్థాయి అధికారుల సమక్షంలో 10 ప్రత్యేక బృందాలు తనిఖీ చేశారు. డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్ ఆధ్వర్యంలో సర్వే చేపట్టారు. ఈ టీంలో ఎంపీడీఓ, ఏఓ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లతో పాటు గ్రామ సచివాలయ పరిధిలోని సిబ్బందిని నియమించారు. లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి వారికి పింఛన్ వచ్చేందుకు గల అర్హత వివరాలను అడిగి తెలుసుకుని, వాటిని సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. వీరభద్రాపురంలో పింఛన్ల తనిఖీని అధికారులు చెట్ల క్రింద కూర్చుని చేశారు. లబ్ధిదారులను ఒక చెట్టు కింద ఉన్న అరుగు వద్దకు పిలిపించుకుని ఒకే చోట సర్వేను పూర్తి చేశారు.

అన్నదానానికి దాతలు సహకరించాలి

చాపాడు: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవస్థాన సన్నిధిలో భక్తులకు అన్నదానం కార్యక్రమం చేపట్టేందుకు దాతలు సహకరించాలని ఆలయ ఈఓ మారుతి ప్రసాద్ కోరారు. మండలంలోని వీరభద్రస్వామి దేవస్థాన సన్నిధిలోని అన్నసత్రంలో సోమవారం మండలంలోని డ్వాక్రా యానిమేటర్ల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ.. వీరభద్రస్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు గత కొన్ని నెలలుగా ప్రతి సోమవారం అన్నదానం చేయటం జరుగుతోందన్నారు. ఇకపై కూడా ప్రతి సోమవారం అన్నదానం చేసేందుకు దాతలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ వీరారెడ్డి, టీడీపీ నాయకులు పెరుగు నారాయణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మామిడి తోటలకు బీమా పథకం

పోరుమామిళ్ల : మామిడి తోటలకు బీమా పథకం అమల్లోకి వచ్చిందని ఉద్యానవన పంటల అధికారి శ్రీనివాసులరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సంస్థ అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ సంస్థ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రైతులను ఆదుకునేందుకు మామిడి పంటకు బీమా అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. బీమా పొందేందుకు బీమా కంపెనీ ద్వారా నియమించబడిన మధ్యవర్తులు మరియు రైతులు నేరుగా పీయంఎఫ్‌బీవై పోర్టల్‌లో లేదా మొబైల్ ద్వారా కూడా బీమా పొందవచ్చన్నారు. బ్యాంక్ అకౌంట్ జిరాక్స్, ఆధార్‌కార్డ్ జిరాక్స్, పాసు బుక్ జిరాక్స్, పంట వేసినట్లు ధ్రువీకరణ పత్రం తీసుకురావాలని సూచించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు మానవ హక్కుల దినోత్సవం

పోరుమామిళ్ల : అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవ సందర్భంగా మంగళవారం పట్టణంలోని చిత్తా గ్రాండ్ ఫోర్ట్‌లో ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మానవ హక్కుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ నాయకులు గంగన్న, ఫణిరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్, బద్వేలు ఆర్‌డీఓ చంద్రమోహన్, తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి, సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కొండారెడ్డి, ఎంపీడీఓ రమణారెడ్డి పాల్గొంటారని తెలిపారు. ప్రత్యేక ఆహ్వానితులుగా చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, రామక్రిష్ణారెడ్డి, సీనియర్ అడ్వకేట్ ప్రభాకర్ హాజరుకానున్నారని పేర్కొన్నారు.

కేసు నమోదు చేయాలని బార్ అసోసియేషన్ తీర్మానం

బద్వేలు అర్బన్ : ముందస్తు నోటీసు లేకుండా ఇంటి నిర్మాణాన్ని కూల్చివేసిన మున్సిపల్ కమిషనర్, సిబ్బందిపై కేసు నమోదు చేయాలని బార్ అసోసియేషన్ తీర్మానం చేసినట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డి.బ్రహ్మారెడ్డి, ఆర్.ఆర్.వర్మ తెలిపారు. బార్ అసోసియేషన్ సభ్యులైన టి.శ్రీధర్ బార్ అసోసియేషన్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం కోర్టు ఆవరణలో నిర్వహించిన సమావేశంలో తీర్మానం చేసినట్లు వారు తెలిపారు. సమావేశంలో సీనియర్ న్యాయవాదులు పి.వి.ఎస్.ప్రసాద్, రాజేశ్వర్‌రావు, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు డి.వి.ఎస్.ఆర్.కృష్ణ, కోశాధికారి రమణారెడ్డి, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

రైతులను మోసగించడం తగదు

ప్రొద్దుటూరు : ప్రభుత్వం రెవెన్యూ సదస్సుల పేరుతో రైతులను మోసం చేస్తోందని రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ప్రతాప్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత ప్రొద్దుటూరులో సభ పెట్టి రైతులకు మేలు జరుగుతుందని చెబుతున్నారని, అసలు దొరసానిపల్లెలో ఎంత మంది రైతులు ఉన్నారో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. జిల్లాలోని రాజోలి రిజర్వాయర్, మిగతా ప్రాజెక్టులను పట్టించుకోకుండా రైతులకు మేలు చేస్తామంటే నమ్మడానికి రైతులు సిద్ధంగా లేరని తెలిపారు.

దివ్యాంగుల వికాసానికి కృషి

కలసపాడు : దివ్యాంగుల సంపూర్ణ వికాసానికి భవిత కేంద్రం కృషి చేస్తోందని మండల విద్యాశాఖాధికారులు ప్రేమ్‌కుమార్, మస్తాన్‌వలి, ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఐఈఆర్‌టీ టీచర్ బి.రాజారెడ్డి మండలంలోని దివ్యాంగులకు భవిత కేంద్రం అందిస్తున్న సదుపాయాలను తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉర్దూ పాఠశాల సిబ్బంది, దివ్యాంగులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవితకు వినతి పత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు

ప్రొద్దుటూరు : మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవితకు మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు వినతి పత్రం ఇచ్చారు. సోమవారం మండలంలోని దొరసానిపల్లెలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ముఖ్య అతిథిగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత హాజరయ్యారు. ఈ సందర్భంగా యూనియన్ పట్టణ ప్రధాన కార్యదర్శి సాల్మన్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్‌కుమార్, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ రవికుమార్ మంత్రికి వినతి పత్రం ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ మున్సిపల్ ఆప్కాస్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కార్మికుల జీతాలు పెంచాలని తెలిపారు. మున్సిపల్ కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించాలని ఇవ్వాలని, 60 ఏళ్లు నిండిన కార్మికులను 62 ఏళ్ల వరకు కొనసాగించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ ఇవ్వాలని కోరారు. క్యాబ్ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని, డీఏ, సరెండర్ లీవ్‌ల డబ్బు త్వరగా మంజూరు చేయాలని, 12వ పీఆర్సీ త్వరగా అమలు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఏపీజీబీ కార్యాలయం కడపలోనే కొనసాగించాలి

ప్రొద్దుటూరు రూరల్ : ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు(ఏపీజీబీ) ప్రధాన కార్యాలయం కడపలోనే కొనసాగించాలని కోరుతూ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవితకు ఏపీజీబీ రిటైర్డు ఉద్యోగులు వినతి పత్రం సమర్పించారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ఏపీజీబీ రిటైర్డు ఉద్యోగులు నీలకంఠారెడ్డి, గురివిరెడ్డి, రఘునాథరెడ్డి, సుబ్రహ్మణ్యం ఉన్నారు.

● ప్రొద్దుటూరులో బీసీ భవన నిర్మాణం కోసం కృషి చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవితను బీసీ ప్రజా చైతన్య సమాఖ్య ప్రతినిధులు కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా బీసీ ప్రజా చైతన్య సమాఖ్య అధ్యక్షుడు బొర్రా రామాంజనేయులు మాట్లాడుతూ బీసీల సంక్షేమం, అభివృద్ధి కోసం బీసీ భవనం ఏర్పాటు చేయాలని చాలా ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నామన్నారు. కానీ ప్రభుత్వాలు బీసీల పట్ల వివక్షత చూపుతున్నాయన్నారు. ఈ ప్రభుత్వంలోనైనా బీసీ భవనంకు ప్రభుత్వం స్థలం సేకరించి నిర్మాణం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ ప్రజా చైతన్య సమాఖ్య ప్రధాన కార్యదర్శి జింకా మార్కండేయ, ఆర్థిక కార్యదర్శి మడక సంటెయ్య, ఉపాధ్యక్షులు వేల్పుల భాస్కర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సోలార్ మోడల్ విలేజ్‌గా గోపవరం



సోలార్ ద్వారా విద్యుత్ ఎలా ఉత్పత్తి అవుతుందో వివరిస్తున్న అధికారులు

ప్రొద్దుటూరు రూరల్ : ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలి యోజన పథకం ద్వారా గోపవరం గ్రామ పంచాయతీ సోలార్ మోడల్ విలేజ్‌గా రూపుదిద్దుకుంటుందని విద్యుత్ శాఖ డీఈఈ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. మండల పరిధి గోపవరం గ్రామ పంచాయతీలోని కొర్రపాడు రోడ్డులో ఉన్న నార్త్ సెక్షన్ విద్యుత్ ఉప కేంద్రంలో సోమవారం ప్రధాన మంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలి యోజన పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు తగ్గట్లు బిల్లులు వస్తుండటంతో సామాన్యులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని విద్యుత్ బిల్లుల నుంచి ఊరట కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేసిందన్నారు. ఈ పథకంలో పైలెట్ ప్రాజెక్టుగా గోపవరం పంచాయతీ ఎంపికైందన్నారు. గృహ వినియోగదారులు ఇంటిపైన సోలార్ రూఫ్ టాప్‌లను నిర్మించుకుని, విద్యుత్ బిల్లులను తగ్గించుకోవచ్చన్నారు. ఇంటి పైకప్పుపై కనీసం 10 చదరపు మీటర్లు లేదా 100 చదరపు అడుగులు కలిగిన స్థలంలో ఒక కిలో వాట్ సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ఒక కిలో వాట్‌కు సంబంధించి సోలార్ ప్యానల్ ఏర్పాటుకు రూ.90 వేలు ఖర్చవుతుండగా, ప్రభుత్వం నుంచి రూ.30 వేలు రాయితీ వస్తుందన్నారు. 2 కిలో వాట్లకు రూ.1.40 లక్షలు ఖర్చవుతుండగా రూ.60 వేలు, 3 కిలో వాట్లకు రూ.2 లక్షలు ఖర్చవుతుండగా రూ.78 వేలు రాయితీ వస్తుందన్నారు. ఈ పథకం కింద సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకునే వారికి బ్యాంకుల నుంచి అతి తక్కువ వడ్డీకే రుణాలు అందిస్తారన్నారు. అనంతరం ప్రాక్టికల్‌గా సోలార్ నుంచి ఏవిధంగా విద్యుత్ ఉత్పత్తి అవుతుందో అనే విషయాన్ని సనా ఎంటర్‌ప్రైజెస్ వెండార్ ప్రతినిధులు ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో నార్త్ సెక్షన్ విద్యుత్ ఉపకేంద్రం ఏఈ షేక్ అబ్దుల్ జబ్బార్, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఏబీసీ సూత్రాలు పాటిస్తే హెచ్ఐవీ నివారణ



హెచ్ఐవీ నివారణపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

చాపాడు: హెచ్ఐవీ నివారణకు ఏబీసీ సూత్రాలను పాటించాలని వైద్యాధికారి డా.ఓబులేసు అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లింకు వర్కర్ స్కీం చైల్డ్ ఫండ్ ఇండియా ఆధ్వర్యంలో గర్భిణులకు హెచ్ఐవీ నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. హెచ్ఐవీ వ్యాధి గ్రస్తులు మానసికంగా బాధ పడుతున్నారని, ఎయిడ్స్ గురించి తెలుసుకుని జాగ్రత్తలు తీసుకుని జీవించవచ్చన్నారు. ఎయిడ్స్ వ్యాధిని ద్వేషించాలని, వ్యాధి సోకిన వారిని ఆదరించాలన్నారు. ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనకు చేయి చేయి కలిపి దేశం నుంచి ప్రారద్రోలాలన్నారు. హెచ్ఐవీ పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ మహాదేవయ్య, ఆరోగ్య విస్తరణాధికారి ఎం.రాఘవయ్య, ఆశా నోడల్ పర్సన్ సుకన్య, సూపర్‌వైజర్‌లు సరస్వతి, ప్రసాద్, చైల్డ్ ఫండ్ ఇండియా ప్రతినిధి దర్బార్‌వలి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న కేంద్ర ప్రభుత్వం



మాట్లాడుతున్న సుబ్రమణ్యం

బద్వేలు అర్బన్ : కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు కొమ్ముకాస్తోందని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీరశేఖర్, సుబ్రమణ్యం విమర్శించారు. సోమవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన వ్యవసాయ కార్మిక సంఘం ఏరియా జనరల్ బాడీ సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతులకు, వ్యవసాయ కూలీలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వారి సంక్షేమాన్ని గాలికొదిలేసిందని దుయ్యబట్టారు. గ్రామాల్లో ఉపాధి కూలీల, వ్యవసాయ కూలీల వలసలు, ఆత్మహత్యలు నివారించాలంటే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ప్రతిఒక్కరికి 200 రోజులు పనిదినాలు కల్పించడంతో పాటు రూ.600 చొప్పున కూలీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన ఏరియా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఏరియా అధ్యక్షుడిగా పొంగూరు నాగరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఖాదర్‌బాషా, ఉపాధ్యక్షులుగా జాకోబ్, నరసయ్య, షాహిదా, సహాయ కార్యదర్శులుగా బాలఓబయ్య, సుబ్బారెడ్డి, ఓబులేసు, కమిటీ సభ్యులుగా పలువురిని ఎన్నుకున్నారు.

ఎఫ్‌సీఎన్ దాతృత్వ సేవలు మరువలేనివి



విద్యార్థినులతో పాఠశాల యాజమాన్యం

కలసపాడు : మండలంలో ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ వ్యవస్థాపకులైన డాక్టర్ గీత, తోమాస్‌రెడ్డి దాతృత్వ సేవలు మరువలేనివని సెయింట్ ఆంటోనీస్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ చిత్తా రాజశేఖర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ చిత్తాప్రభావతి కొనియాడారు. సోమవారం స్థానిక సెయింట్ ఆంటోనీస్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 239 మంది స్పాన్సర్‌షిప్ ఉన్న పేద విద్యార్థులకు క్రిస్మస్ పండుగ సందర్భంగా దుస్తులు, లగేజ్ బ్యాగ్, లంచ్ బాక్స్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ చిత్తారాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో మారుమూల ప్రాంతమైన కలసపాడు మండలంలో సుదూర ప్రాంతాల నుంచి చదువుకునేందుకు వస్తున్న విద్యార్థినీ విద్యార్థులకు స్పాన్సర్‌షిప్ ప్రోగ్రామ్ ఏర్పాటు చేసి వారికి సహాయ సహకారాలు అందిస్తున్న ఎస్ఎఫ్‌సీ సంస్థ వారికి పాఠశాల యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

కనువిందు చేస్తున్న జలపాతం

చుట్టూ పరుచుకున్న పచ్చదనం .. ఆకాశాన్ని తాకుతున్నట్లు కొండలు .. వందల అడుగుల ఎత్తు నుండి జాలువారే జలపాతం .. పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. లంకమల అభయారణ్యంలోని లంకమల క్షేత్రం సమీపంలో కొండల పై నుంచి జాలువారే జలపాతం కనువిందు చేస్తోంది. గత వారం క్రితం కురిసిన వర్షాలకు లంకమల అభయారణ్యంలోని ఎత్తైన కొండల నుంచి తెల్లని నురగలా జాలువారుతున్న నీరు పర్యాటకులను ఇట్టే కట్టిపడేస్తున్నాయి. అంతేకాకుండా అభయారణ్యంలోని లంకమల వాగుతో పాటు పలు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

–బద్వేలు అర్బన్



లంకమల అభయారణ్యంలో కొండలపై నుంచి జాలువారుతున్న జలపాతం